సాక్షి సంగారెడ్డి

శనివారం । 8 ఫిబ్రవరి । 2025



తీగల రాపిడి.. రైతుల అలజడి

వేలాడుతున్న కరెంట్ తీగలు చెరకు రైతుల పాలిట శాపాలుగా మారుతున్నాయి.

వివరాలు 8లో ▸



సంతలో ఎద్దుల జాతర

న్యాల్‌కల్ గ్రామ శివారులో ఆదివారం పశువుల సంత నిర్వహించనున్నారు.

వివరాలు 8లో ▸



'నులి'ని నలిపేద్దాం

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

వివరాలు 9లో ▸

పోటా పోటీగా సభలు

మెతుకు సీమ వేదికగా కాంగ్రెస్, బీఆర్ఎస్ బలప్రదర్శన

- ప్రభుత్వ వైఫల్యాలపై గజ్వేల్‌లో కేసీఆర్ బహిరంగసభ
- జహీరాబాద్ నేతల భేటీలో గులాబీ బాస్ వెల్లడి
- వర్గీకరణ, కులగణనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికారపార్టీ..
- గజ్వేల్ లేదా నర్సాపూర్‌లో భారీ సభకు యోచన



సాక్షిప్రతినిధి,సంగారెడ్డి: రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ బల ప్రదర్శనకు ఉమ్మడి మెదక్ జిల్లా వేదికకానుంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గజ్వేల్‌లో భారీ బహిరంగసభను నిర్వహించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించగా, కాంగ్రెస్ పార్టీ కూడా గజ్వేల్ లేదా మెదక్ జిల్లా నర్సాపూర్‌లోగానీ బహిరంగసభ నిర్వహించాలనుకుంటోంది. కులగణన, ఎస్సీ వర్గీకరణ తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమాయత్తమవుతోంది. ఇలా అధికార, ప్రతిపక్ష పార్టీల సభలతో ఉమ్మడి జిల్లా రాజకీయాలు వేడెక్కనున్నాయి.

నెలాఖరులో బీఆర్ఎస్ సభ

జహీరాబాద్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు వారం క్రితం ఎర్రవల్లి ఫాంహౌజ్ వరకు పాదయాత్రగా వెళ్లి ఆ పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నెలాఖరులో బహిరంగ సభను నిర్వహిస్తామని కేసీఆర్ కీలక ప్రకటన చేశారు. తనకు వట్టిగ కొట్టుడు అలవాటు లేదని... ప్రకటించిన కేసీఆర్ గజ్వేల్‌లో సభను భారీ ఎత్తున నిర్వహించే యోచనలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల నిర్మాణం, కాళేశ్వరం ప్రాజెక్టు ఎండబెట్టడం వంటి వైఫల్యాలపై ఈ సభలో ప్రజలకు వివరించాలని భావిస్తున్నారు. ఈ సభను తమ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని... అన్ని జిల్లాల నుంచి గులాబీ శ్రేణులను సభకు తరలించాలని యోచిస్తున్నట్లు ఆ పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలోనే కాంగ్రెస్ సభ

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణన, ఎస్సీ వర్గీకరణపై కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ రెండు నిర్ణయాలు అనుకున్నంతగా కాంగ్రెస్‌కు ప్రయోజనం చేకూరలేదు. దీంతో వీటిని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లే యోచనలో భాగంగా రెండు బహిరంగసభలను నిర్వహించాలని కాంగ్రెస్ యోచిస్తోంది. ఇందులో వర్గీకరణకు సంబంధించిన సభను మెదక్ జిల్లాలోని నర్సాపూర్ లేదా సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో గానీ నిర్వహించాలని నిర్ణయించినట్లు గురువారం సీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ బహిరంగసభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేదా అగ్రనేత రాహుల్‌గాంధీనిగానీ రప్పించే యోచనలో కాంగ్రెస్ పార్టీ ఉంది.

ఆసక్తికరమైన చర్చ...

అధికార, ప్రతిపక్ష పార్టీల బహిరంగసభలు ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో నిర్వహించాలని నిర్ణయించడంతో జిల్లాలో రెండు పార్టీ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. అన్ని జిల్లాలకు గజ్వేల్ సెంటర్ పాయింట్ అవుతుంది. అన్ని జిల్లాల నుంచి ఆయా పార్టీల శ్రేణులను తరలించడం కూడా వీలవుతుంది. పైగా మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో గులాబీ పార్టీ ఈ గజ్వేల్‌లోనే సభను నిర్వహించాలని భావిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకుని ఇటు కాంగ్రెస్ కూడా కేసీఆర్ ఇలాఖాలోనే సభను నిర్వహించాలని భావిస్తుండటం ఆసక్తికరంగా మారింది.



ఐలాపూర్‌లో ముఖీమ్, రంగనాథ్‌ల మధ్య సంవాదం

అమీన్‌పూర్‌లో సమగ్ర సర్వే

- ఆక్రమణలు గుర్తించేందుకు త్వరలో నిర్వహణ
- ప్రకటించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- ఐలాపూర్, చక్రపురి, ఆర్టీసీ, వెంకటరమణ కాలనీల్లో పర్యటన

పటాన్‌చెరు/సాక్షి, సిటీబ్యూరో: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో లే ఔట్ల కబ్జాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరిహద్దుల్ని తేల్చేందుకు త్వరలోనే సాంకేతిక సర్వే నిర్వహిస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని పలు లేఔట్లలో కబ్జాలపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానికులతో సమావేశాలు నిర్వహించారు. ఐలాపూర్, చక్రపురి కాలనీ, ఆర్టీసీ కాలనీ, వెంకటరమణ కాలనీ ప్రాంతాల్లో రంగనాథ్ పర్యటించారు. ఈ మున్సిపాలిటీ పరిధిలో సర్వే కోసం సర్వే ఆఫ్ ఇండియా, ఏడీ సర్వే విభాగం, రెవెన్యూ, హైడ్రా సర్వే బృందాలను వినియోగిస్తూ అందరి సమక్షంలో పారదర్శకంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఐలాపూర్‌లో నాలుగు వేలమంది ప్లాట్లు ఖరీదు చేసిన వెంచర్ ప్రభుత్వ భూమి అంటూ గతంలో రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై దాదాపు 40 ఏళ్లుగా ఆయా ప్లాట్ల యజమానులు న్యాయపోరాటం చేస్తున్నారు. కోర్టు ఉత్తర్వులు వెలువడకుండానే ముఖీం అనే న్యాయవాది తమ ప్లాట్లు కబ్జా చేసినట్లు స్థానికులు రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్లారు. దాదాపు 700 ప్లాట్లు వేరే వారికి విక్రయించేశారని, ఇతడితో ప్రభుత్వ విభాగాలు సైతం కుమ్మక్కు కావడంతో కరెంట్, మంచి నీరు, రోడ్ల సౌకర్యాలు కూడా వచ్చాయని స్థానికులు పేర్కొన్నారు. ఇదేమంటూ ప్రశ్నిస్తే గతంలో ఓ హత్య కేసులోనూ నిందితుడిగా ఉన్న ముఖీం తమపై దాడులకు దిగుతున్నాడని ఆరోపించారు. అలాగే విజయ కృష్ణంరాజు అనే వ్యక్తి ఇక్కడ 2005లో 53 ఎకరాలు కొన్నారని..తర్వాత 18 ఎకరాలకు పైగా కబ్జా చేశారంటూ చక్రపురి కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. త్వరలోనే హైడ్రా పోలీసుస్టేషన్ కూడా ఏర్పడుతోందని ఆపై కబ్జాదారులపై కఠిన చర్యలు ఉంటాయని రంగనాథ్ తెలిపారు.

క్షుణ్ణంగా పరిశీలిస్తాం: రంగనాథ్

అమీన్‌పూర్ రాజగోపాల్‌నగర్‌లో ఉన్న ఐలాపూర్‌లో భూమికి సంబంధించి ప్రజావాణిలో ఫిర్యాదు వచ్చింది. తాము 1980ల్లో తీసుకున్న ప్లాట్స్‌ను కొందరు కబ్జా చేస్తున్నట్లు బాధితులు హైడ్రాకు విన్నవించినట్లు రంగనాథ్ తెలిపారు. ఈ భూమిపై ప్రభుత్వానికి అప్పట్లో వెంచర్ చేసిన వారికి మధ్య వివాదం నడుస్తోందని, దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు ఇప్పుడు తమ ప్లాట్లకు కబ్జా చేస్తున్నారని తమ దృష్టికి తీసుకొచ్చినట్లు వివరించారు. అడ్వొకేట్ ముఖీం స్థానికంగా ఉన్న దళితులను అడ్డుపెట్టుకుని కబ్జాలకు పాల్పడుతున్నారని, ఆ ప్లాట్ల యజమానుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే స్థానికులతో భేటీ కావడంతో పాటు పాటు ముఖీం తోనూ చర్చించామని చెప్పారు. త్వరలో ప్రతి ఒక్కరి నుంచి డాక్యుమెంట్లు సేకరించి పరిశీలిస్తామని, చట్ట ప్రకారం ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఇక్కడ కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారనీ ఫిర్యాదులు వస్తున్నాయని, ఒకటి రెండు నెలల్లోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. లేఔట్ సక్రమమైనా, అక్రమమైనా అందులో ఉన్న ఓపెన్ ప్లేసులన్నీ ప్రభుత్వ స్థలాలేనని వాటిని కచ్చితంగా హైడ్రా పరిరక్షిస్తుందని స్పష్టం చేశారు.



తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్లాటు ఓనర్ల ప్లకార్డుల ప్రదర్శన

మెరుగైన వసతులను కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

- డబుల్‌బెడ్‌రూం కేసీఆర్ కాలనీ సందర్శన
- అధికారులతో సమీక్ష

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ డబుల్‌బెడ్‌రూం కేసీఆర్‌నగర్ కాలనీవాసులకు మెరుగైన మౌలిక వసతులను కల్పించాలని కలెక్టర్ వల్లూరు కాంత్రి అధికారులను ఆదేశించారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని డబుల్‌బెడ్ రూం కేసీఆర్ కాలనీను శుక్రవారం ఆమె సందర్శించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఇప్పటివరకు కాలనీలో 7,258 కుటుంబాలకు చెందిన 30వేల మంది జనాభా ఇక్కడ నివాసం ఉంటున్నారన్నారు. వీరికి ప్రాథమిక, ఉన్నత ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, పోలీస్ అవుట్ పోస్ట్, రేషన్ దుకాణాల ఏర్పాటు ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని, అందుకు కావాల్సిన ప్రణాళికలను రూపొందించాలని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

కమిషనర్‌కు సెలవు ఎందుకు ఇచ్చారు...?

కేసీఆర్ కాలనీలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డితో పలువురు అధికారులు హాజరుకాకపోవడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అదనపు కలెక్టర్‌కు ఫోన్ చేసి కమిషనర్‌కు ఎందుకు సెలవు మంజూరు చేశారని ప్రశ్నించారు. తను సమావేశానికి వస్తున్నానని తెలిసి, ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఏవిధంగా సెలవు ఇచ్చారని నిలదీశారు. కమిషనర్‌తో పాటు ఇంకా ఎంతమంది సిబ్బంది సెలవుపై వెళ్లారని ఆరాతీశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: త్వరలో జరుగనున్న కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి మరోసారి తనకు అవకాశం కల్పించాలి ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి కోరారు. సంగారెడ్డిలోని ఎస్టీయూ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగ సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. నిరంతరం ఉపాధ్యాయుల పక్షాన నిలబడతానని హామీనిచ్చారు. పాఠశాలలతో సంబంధం లేని వ్యక్తులను గెలిపిస్తే ఉపాధ్యాయుల విలువలు దిగజారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరేళ్లుగా అనేక సమస్యలు పరిష్కారానికి కృషి చేశానని, ప్రధానంగా ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల విషయంలో ప్రభుత్వాన్ని ఒప్పించానని గుర్తుచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస్ రాథోడ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ నిర్మాణం ఆపండి

సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్యారానగర్‌లో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని, ఈ నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులపై కేసు పెట్టడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సీపీఎం ప్రతినిధి బృందంతో కలసి కలెక్టరేట్ ఏవో పరమేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ నిర్మాణంకోసం ప్రభుత్వం బలవంతంగా రైతుల నుంచి భూములు గుంజుకోవడం దారుణమన్నారు. పోలీసులతో పెట్టి గ్రామాల్లో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య, మాణిక్యం, జి.సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

డంపింగ్ యార్డ్ నిలిపివేయాలి

జిన్నారం(పటాన్‌చెరు): ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ పనులను వెంటనే నిలిపివేయాలని ఎయిరో స్పేస్ సేఫ్టీ ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ శుభం మిశ్రా సూచించారు. ఈ మేరకు కలెక్టర్ వల్లూరు క్రాంతికి శుక్రవారం లేఖ రాశారు. ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే విమానాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని, పరిసర ప్రాంతాల్లో పక్షుల సంచారం పెరుగుతుందని, శిక్షణ విమానాలకు అవాంతరాలు ఎదురవుతాయని వివరించారు.

పంటలు ఎండిపోకుండా చూడండి: బక్కి

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ శివారులో రైతుల పంటలు ఎండిపోకుండా కాలువలతో చెరువులు నింపాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. మండలంలోని ఇబ్రహీంపూర్, బోనాల గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు కాలువల నీరు రాకుంటే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని వాపోయారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. రెండు గ్రామాల శివారులోని చెరువులకు కాలువల నీటితో నింపాలని చెప్పారు. ఆయనతో పాటు ఎగ్గిడి శేఖర్, లచ్చిరెడ్డి, చాతిరి స్వామి, మల్లయ్య, నర్సింలు తదితరులు ఉన్నారు.

భళా.. జాబ్ మేళా!

- జిల్లా ఉపాధి కల్పన ఆధ్వర్యంలో ఉద్యోగాలు
- ప్రైవేట్ అనుబంధ సంస్థల్లో ఖాళీల గుర్తింపు
- ఎంప్లాయ్‌మెంట్ కార్డుల రెన్యూవల్
- లబ్ధి పొందుతున్న గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులు

సంగారెడ్డి టౌన్: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలు నిరుద్యోగులకు వరంగా మారాయి. ప్రైవేటు అనుబంధ సంస్థల్లో ఖాళీలను గుర్తించి, నిరుద్యోగులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారు. అర్హతను బట్టి ప్రైవేటు పరిశ్రమల్లో ఉద్యోగ కల్పనకు కృషి చేస్తున్నారు. పదో తరగతి ఆపై చదివిన వారికి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ద్వారా ఉద్యోగాలు కల్పిస్తూ నిరుద్యోగితను తగ్గిస్తున్నారు. 2016 నుంచి ఇప్పటివరకు 350 జాబ్ మేళాలు ఏర్పాటు చేయగా 7,500 మంది వరకు నిరుద్యోగులు జాబ్ మేళాలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో 2,152 మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. ఆన్‌లైన్‌లో ఎంప్లాయ్‌మెంట్ కార్డు ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కార్యాలయం ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉపాధి కల్పించేందుకు ఉద్యోగ మేళాలు నిర్వహిస్తోంది. గతంలో ఎంప్లాయ్‌మెంట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే కొన్ని రోజులపాటు కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. ప్రస్తుత టెక్నాలజీ అనుకూలంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించారు. 18 ఏళ్లు నిండిన వారు ఆధార్, కుల, నివాస, విద్యార్హత ధ్రువపత్రాలను ఏదైనా నెట్ సెంటర్, మీ సేవా కేంద్రాల ద్వారా httpr://www.employment.telangana.gov.in సైట్‌లో అప్‌లోడ్ చేసి ఎంప్లాయ్‌మెంట్ కార్డును పొందవచ్చు. నిరుద్యోగతను బట్టి జిల్లా కార్యాలయ సిబ్బంది జిల్లాలోని చుట్టుపక్కల ప్రైవేట్ కంపెనీల్లో విజిట్ చేసి అందులో ఉద్యోగ ఖాళీల వివరాలను సేకరిస్తారు. అనంతరం జాబ్ మేళాలు నిర్వహిస్తుంటారు.



ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

వీరు అర్హులు

పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీటెక్, టెక్నికల్ కోర్సులు పూర్తయినవారికి ఉద్యోగాలు కల్పిస్తారు. ఎంప్లాయ్‌మెంట్ కార్డుతో సీనియారిటిని బట్టి కొన్ని కంపెనీల్లో ఉద్యోగం సాధించడానికి అవకాశం ఉంటుంది. తండాల్లో నిరుద్యోగ మహిళలు, పురుషులకు ఉద్యోగాలపై అవగాహన కల్పించి ఉద్యోగాల్లో స్థిరపడేలా జిల్లా కార్యాలయ సిబ్బంది చొరవ చూపిస్తున్నారు.

బ్యాంకులో ఉద్యోగం పొందాను



ఎంబీఏ పూర్తి చేసిన నేను ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉన్న సమయంలో ఉపాధి కల్పన కార్యాలయంలో నిర్వహించిన జాబ్ మేళాకు హాజరయ్యాను. ఎస్‌బీఐ బ్యాంకులో డెవలప్‌మెంట్ మేనేజర్‌గా ఉద్యోగం పొందాను.

– సంగమేశ్వర్, సంగారెడ్డి

అపోలో ఫార్మసీలో ఉద్యోగం వచ్చింది



ఇంటర్ విద్యార్హతతో జాబ్ కోసం ఎంతో ప్రయత్నించినా ఎక్కడా దొరకలేదు. ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాకు హాజరయ్యాను. అపోలో ఫార్మసీలో మంచి జీతంతో ఉద్యోగం లభించింది.

–సుజాత, రుద్రారం గ్రామం, పటాన్‌చెరు మండలం

నిరుద్యోగులకు వరం



ప్రతీ నెలా రెండు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నాము. జిల్లాలో చుట్టుపక్కల కంపెనీల్లో ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం తరచూ ప్రైవేట్ కంపెనీలను సందర్శిస్తున్నాం. నిరుద్యోగులు ఉద్యోగాలు పొంది లబ్ధిపొందుతున్నారు.

–అనిల్ కుమార్, ఉపాధి కల్పనాధికారి

న్యూస్‌రీల్

పొగాకు అనర్థాలపై అవగాహన



పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

నారాయణఖేడ్: జిల్లా పొగాకు నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఖేడ్ మండలం తుర్కపల్లిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామని పీహెచ్‌సీ సిబ్బంది, రోగులు, విద్యార్థులతో జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.హరిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతృత్వానికి నిలువెత్తు నిదర్శనం



రమాబాయి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: అణగారిన వర్గాల భవిష్యత్ కోసం తన కన్న పిల్లల్ని పోగొట్టుకొన్న రమాబాయి అంబేడ్కర్ మాతృత్వానికి నిలువెత్తు నిదర్శనం అని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం పేర్కొన్నారు. రమాబాయి 127వ జయంతి సందర్భంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ.. రమాబాయి స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో అధిక లాభాలు


డీడీ సోమేశ్వర్‌రావు



మాట్లాడుతున్న డీడీ సోమేశ్వర్‌రావు

జహీరాబాద్‌టౌన్: ఉద్యాన పంటల సాగు రైతులకు లాభాలు తెచ్చిపెడుతుందని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సోమేశ్వర్‌రావు పేర్కొన్నారు. గోవింద్‌పూర్ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ ఆధ్వర్యంలో రైతులకు ఉద్యాన పంటల సాగుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అయిల్‌పామ్, పండ్లు, కూరగాయలు, పూలు తదితర ఉద్యాన పంటలకు కూడా సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందజేస్తున్నారు. ఆసక్తిగల రైతులు ముందుకు వస్తే కూరగాయలు, అయిల్‌పామ్ సాగుకు అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ మండల అధికారి పండరి, అయిల్ పామ్ గోద్రెజ్ మేనేజర్ కొండల్‌రావు, శాస్త్రవేత్త శైలజ, మామిడి రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ విజేత సెయింట్ ఆంథోనీస్



ట్రోఫీ విద్యార్థులతో యాజమాన్యం

సంగారెడ్డి: మహబూబాబాద్‌లో టెన్నీస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్ విజేతగా విద్యానగర్ సెయింట్ ఆంథోనీస్ క్రికెట్ జట్టు నిలిచింది. ఈ మేరకు పాఠశాల చైర్మన్ ఆంథోనీరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమీల శుక్రవారం మీడియాకు వెల్లడించారు. బాలురు, బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టుతో తలపడి తెలంగాణ జట్టు తరపున తమ పాఠశాల విద్యార్థులు ట్రోఫీని గెలుచుకున్నారని వివరించారు. విజేతలు న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను అభినందించారు.

ఈ నెల 15ను సాధారణ సెలవు దినంగా ప్రకటించాలి

సంగారెడ్డి: సేవాలాల్ మహారాజ్ జయంతిరోజైన ఫిబ్రవరి 15ను రాష్ట్రం ప్రభుత్వం సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని లంబాడాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

క్లుప్తంగా

ఎండు గంజాయి స్వాధీనం



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

మునిపల్లి(అందోల్): ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ బృందం ఎస్‌ఐ దుబ్బాక శంకర్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. కంకోల్ టోల్ ప్లాజా వద్ద 6వ తేదీన రాత్రి వాహనాల తనిఖీ చేస్తుండగా సంగారెడ్డికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై 200 గ్రాముల ఎండు గంజాయిని తీసుకెళ్తున్నారు. వెంటనే వారిని పట్టుకొని గంజాయి, బైక్‌ని స్వాధీనం చేసుకున్నాం. కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐలు హనుమంతు, అనుదీప్, కానిస్టేబుల్ అరుణ్ జ్యోతి, అంజిరెడ్డి,రాజేశ్, శివకాంత్ పాల్గొన్నారు.

భార్యను పొడిచిన భర్త

- అడ్డొచ్చిన బావమరిదిపై దాడి
- నిందితుడి అరెస్ట్



నిందితుడితో పోలీసులు

రేగోడ్(మెదక్): భార్యను, బావమరిదిని కత్తితో పొడిచి పారిపోయిన వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌ఐ పోచయ్య శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. రేగోడ్ గ్రామానికి చెందిన ద్యారంగుల వెంకయ్య అదే గ్రామానికి చెందిన నాగమణి భార్యాభర్తలు. కొన్నేళ్లుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. 3న రాత్రి తల్లిగారి ఇంటి వద్ద ఉన్న నాగమణితో భర్త వెంకయ్య మళ్లీ గొడవకు దిగాడు. భార్య నాగమణిని, అడ్డువచ్చిన బావమరిది గురువయ్యను కత్తితో పొడిచి పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు వెంకయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. బాధితులు సంగారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అప్పుల బాధతో వెలుగు సీఏ ఆత్మహత్యాయత్నం

రామాయంపేట(మెదక్): అప్పుల బాధతో వెలుగు సీఏ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని కాట్రియాల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలో వెలుగు సీఏగా పని చేస్తున్న కమ్మరి శ్యామల అప్పుల బాధతో శుక్రవారం రాత్రి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రి నుంచి సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రైవేట్ ఫైనాన్స్‌ల్లో రుణాలు తీసుకున్న ఆమె చెల్లించడానికి తీవ్ర ఇబ్బందులపాలవుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వరావు కథనం మేరకు.. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని శాంతి నగర్ కాలనీలో ఉన్న మద్యం దుకాణం సమీపంలో శుక్రవారం దాదాపు 40 ఏళ్లు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నాడు. స్థానికులు 108 సహాయంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీగల రాపిడి.. రైతుల అలజడి

నిత్యం తోటల వద్ద అగ్నిప్రమాదాలు

- చెరకు తోటలు, డ్రిప్ పరికరాలు ఆహుతి
- ఎకరాలకు ఎకరాలు కాలిబూడిద
- రూ.లక్షల్లో నష్టపోతున్న అన్నదాతలు
- జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలో ఆందోళనకర పరిస్థితులు



ఇప్పెపల్లి గ్రామ శివారులో కాలిపోతున్న చెరకు పంట



మొగుడంపల్లిలో వేలాడుతున్న కరెంట్ తీగలు

వేలాడుతున్న కరెంట్ తీగలు చెరకు రైతుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. తీగల రాపిడి వల్ల నిప్పురవ్వలు పడి తోటలు అగ్నికి ఆహుతవుతున్నాయి. చేతికి వచ్చిన తోట కాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతీ సంవత్సరం అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్న అన్నదాతలు ఏమీ చేయలేక పోతున్నారు. నష్టాల నుంచి బయట పడదానికి నానా అవస్థలు పడుతున్నారు.

– జహీరాబాద్ టౌన్:

జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలో అధిక శాతం మంది రైతులు చెరకు పంట సాగు చేస్తుంటారు. ప్రతీ ఏడాది సుమారు 25 వేల ఎకరాల్లో సాగు జరుగుతుంది. విత్తనం నాటి నుంచి కర్మాగారానికి సరఫరా వరకు రైతులు తిప్పలు తప్పవు. దిగుబడి రాక, గిట్టుబాటు ధర లేక పెట్టుబడులు రాని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు వ్యవసాయ బావుల వద్ద కరెంట్ తీగలు రైతులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వైర్లు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు చెలరేగి తోటలపై పడుతున్నాయి. దీంతో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రైతులు చూస్తుండగానే తోటలు ఎకరాలకు ఎకరాలు కాలిబూడిదవుతున్నాయి. రూ.లక్షల్లో నష్టపోయి కోలుకోలేకపోతున్నారు.

ప్రమాదాలకు కారణాలు

చెరకు తోటలను నీరందించడానికి ప్రతీ ఒక్క రైతు పొలంలో బోరు మోటార్ వేసుకుంటారు. పంపుసెట్ల మోటార్ కరెంట్ సరఫరా కోసం చెరకు పొలాల్లో విద్యుత్ లైన్ వేస్తారు. కరెంట్ తీగలు వదులుకావడం వల్ల గాలివీచే సమయంలో ఒకదానికి మరొకటి తాకి నిప్పు రవ్వలు పడుతుంటాయి. ఏపుగా పెరిగిన చెరకు గడలు కూడా తీగలకు తగలడంతో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు చోటు చేసుకొని కాలిపోతున్నాయి. తోటలతోపాటు డ్రిప్ పరికరాలు కూడా కాలిబూడిదవుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అధికారుల సూచనలు

చెరకు తోట ఉన్న ప్రాంతానికి ఆరు అడుగుల దూరంలో విద్యుత్ స్తంభాలు, తీగలు ఉండేలా చూసుకోవాలి. తీగలు వదులుగా ఉండకుండా చూడాలి. తీగలు వేలాడుతున్నట్లు అయితే ట్రాన్స్‌కో శాఖ అధికారులకు తెలియజేయాలి. మోటారు పంపుసెట్లు విద్యుదాఘాతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.



పంటకు పంచనామా చేస్తున్న అధికారులు

ఇటీవల జరిగిన ఘటనలు

- న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో 11 ఎకరాల చెరకు తోట కాలిపోయింది. మాతంశెట్టి మల్లికార్జున్, బస్వరాజ్, యాదుల్లాకు చెందిన చెరకు తోటకు నిప్పంటుకొని పంటతో పాటు డ్రిప్ పరికరాలు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.15 లక్షల నష్టం జరిగింది.
- జనవరి 21న మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లి గ్రామం పరిధిలో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 50 ఎకరాల చెరకు తోట అగ్నికి ఆహుతైంది. దాదాపు పది మందికి చెందిన రైతుల చెరకు పంట కాలిపోయింది. ఈ ఘటనతో సుమారు రూ.కోటి వరకు నష్టం వాటిల్లింది.
- అదే రోజు దత్తప్పకు చెందిన పొలంలో కరెంట్ షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి చెరకు తోటలోని డ్రిప్ పైపులైన్లు కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల నష్టం జరిగింది.
- జనవరి 22న మొగుడంపల్లి మండలం గౌసాబాద్ గ్రామ పరిధిలో రైతుల సంజీవ్‌రెడ్డి పొలంలో లారీలో చెరకు పంట లోడ్ చేస్తున్న సమయంలో గాలులు వీచాయి. కరెంట్ తీగలు వదులుగా ఉండడంతో ఒకదానికి ఒకటి తాకి నిప్పు రవ్వలు పడి ప్రమాదం జరిగింది. తోటతోపాటు లారీ కాలిపోయింది. ఈ ప్రమాదంలో భారీ నష్టం వాటిల్లింది.
- గతేడాది నవంబర్ 30న ఝరాసంగం మండలం బర్దిపూర్‌లో గ్రామ పరిధిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎకరం చెరకు తోట కాలిపోయి రూ.లక్ష నష్టం జరిగింది.

రూ.3 లక్షలు నష్టం



మాది మొగుడంపల్లి మండలంలోని సున్నంబట్టి తండా. మొగుడంపల్లి గ్రామంలో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని చెరకు పంట పండిస్తున్న. కరెంట్ తీగల రాపిడి వల్ల గత నెలలో అగ్నిప్రమాదం జరిగి చెరకు తోట కాలిపోయింది. రూ. 3 లక్షల నష్టం జరిగింది. ప్రభుత్వం తనను ఆదుకొని ఆర్థిక సహాయం చేయాలి.

– దేవిసింగ్, సున్నంబట్టి తండా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- భూ తగాదాలతో హత్య చేశారంటూ భార్య పోలీసులకు ఫిర్యాదు
- చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో ఘటన



కనకయ్య మృతదేహం

కొండపాక(గజ్వేల్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామంలో చోటు చేసుకుంది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం మేరకు.. ఆకునూరు గ్రామానికి చెందిన దొండకాయల కనకయ్య(55) సిద్దిపేటలో హమాలీ పని చేస్తూ, వ్యవసాయ భూమి కూడా ఉండగా 30 ఏళ్లుగ సాగు చేస్తున్నాడు. 6న బైక్‌పై ఆకునూరు గ్రామానికి వెళ్తున్నానంటూ ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. భార్య లక్ష్మి బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం కొండపాక మండలంలోని దుద్దెడ మధిర సెలంపు గ్రామ శివారులోని అట్లగుట్ట దగ్గర రోడ్డుపై కనకయ్య మృతి చెంది ఉన్నాడని భార్యకు సమాచారం అందింది. మెడ భాగంలో నల్లగా కమిలిపోయి ఉంది. చెట్ల పొదల మధ్య బైక్‌పై అనుమానాస్పద స్థితిలో చనిపోయి ఉన్నాడు.

మృతిపై అనుమానాలు..

కనకయ్య అక్క యాదవ్వను కొండపాక మండలంలోని జప్తినాచారం మధిర రాజంపల్లికి చెందిన అబ్బు లింగం వివాహం చేసుకున్నాడు. అయితే, కనకయ్య సాగు చేసుకుంటున్న భూమికి ఆనుకొని కొంత భూమిని అబ్బులింగం కొనుగోలు చేశాడు. కనకయ్య భూమి కూడా మాదే అంటూ కొన్నేళ్లుగా పంచాయితీ నడుస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని అబ్బు లింగం, యాదవ్వ, అబ్బు క్రిష్ణమూర్తి, మర్పడ్గ గ్రామానికి చెందిన పిండి ఎల్లం కలిసి తన భర్తను హత్య చేసి ఇక్కడ పడేశారంటూ మృతుడి భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని సిద్దిపేట ఏసీపీ మధు పరిశీలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సరిపోదా.. శుక్రవారం!

- ఒక్కరోజే భారీగా దాఖలైన నామినేషన్లు
- గ్రాడ్యుయేట్స్‌కి 28, టీచర్స్‌కి 2
- ర్యాలీగా నామినేషన్లు వేసిన నరేందర్‌రెడ్డి, అంజిరెడ్డి
- స్వతంత్రులుగా రవీందర్‌సింగ్, హరిక్రిష్ణ నామపత్రాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్–మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు పోటెత్తాయి. ఆయా స్థానాలకు పోటీ చేస్తున్న ఆశావహులంతా అనుచరుగణంతో భారీ ర్యాలీలుగా వచ్చి నామినేషన్లు వేశారు. శుక్రవారం ఒక్కరోజే గ్రాడ్యుయేట్స్ స్థానానికి 28 మంది నామినేషన్లు వేయగా, టీచర్స్ స్థానానికి రెండు చొప్పున వేశారు. 3వ తేదీన నామినేషన్ల పర్వం మొదలైనప్పటికీ శుక్రవారం అత్యధికం దాఖలు కావడం గమనార్హం. ఉదయం ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి నామినేషన్ వేశారు. బీజేపీ నుంచి బరిలో ఉన్న అంజిరెడ్డి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి వెంటరాగా, బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ మేయర్ రవీందర్ సింగ్, ప్రసన్న హరిక్రిష్ణ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. వీరితోపాటు సామాజిక ఉద్యమకారులు బక్క జడ్సన్, సిలివేరు శ్రీకాంత్, మాజీ డీఎస్పీ మదనం గంగాధర్, లక్ష్య స్కూల్స్ అధినేత ముస్తాక్‌అలీ నామినేషన్ పత్రాలను కలెక్టర్ పమేలాకు అందజేశారు.

నేడు, రేపు సెలవు

నేడు రెండో శనివారం, రేపు ఆదివారం కావడంతో నామినేషన్ల ప్రక్రియకు సెలవు వచ్చినట్లయింది. ఇక మిగిలింది 10వ తేదీ మాత్రమే. ఇంతవరకూ వేయని వారితోపాటు రెండోసారి వేసేవారికి ఇదే చివరి అవకాశం. సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి మరోసారి నామినేషన్ దాఖలు చేయనున్నారు. అలాగే మాజీ మేయర్ రవీందర్ సింగ్ కూడా రెండో సెట్ దాఖలుకు ర్యాలీ తీయనున్నారు. న్యాయవాది మెతుకు హేమలతా పటేల్ గ్రాడ్యుయేట్ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు.

అరుదైన ఆపరేషన్ విజయవంతం

సంగారెడ్డి: అత్యంత క్లిష్టమైన శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తికి అరుదైన శస్త్ర చికిత్సను సంగారెడ్డి వైద్యులు విజయవంతంగా నిర్వహించి అతడికి ఊపిరి పోశారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దాదయ్యపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ వెంకటేశం కొన్ని రోజుల క్రితం నుంచి ఊపిరి తీసుకోవడంలో చాలా ఇబ్బందిగా ఉండటంతో సంగారెడ్డిలోని బాలాజీ ఆసుపత్రిలో చేర్చారు. అతడికి వైద్య పరీక్షలు చేసి ఊపిరితిత్తులలో కుడివైపు తీవ్రమైన ఇన్ఫెక్షన్, చీము నిండి (పైయిమా థోరాసిస్) ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వెంటనే ఆపరేషన్ చేసుకోవాల్సిందిగా సూచించారు. ప్రాణాపాయంతో కూడిన అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ ఇదని రోగి కుటుంబసభ్యులకు వివరించారు. వారి అనుమతితో ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేసుకుని విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సను వైద్యులు పవన్ కుమార్, శంకర్ నారాయణ, కె.శ్రీధర్ నిర్వహించారు. ఇటువంటి శస్త్రచికిత్స సంగారెడ్డి జిల్లాలోనే మొట్టమొదటిదని వైద్యులు పేర్కొన్నారు.



రోగితో ఆస్పత్రి వైద్యులు

శత సహస్ర సూర్య నమస్కారాలు

- రేపు సిద్దిపేట పట్టణంలో నిర్వహణ
- 20 జిల్లాల నుంచి 1400 మంది యోగా సాధకుల రాక



సిద్దిపేట పట్టణంలో సూర్య నమస్కారాలు చేస్తున్న యోగా సాధకులు (ఫైల్)

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రపంచానికి ఆరోగ్యాన్ని పంచుతున్న సూర్యుడికి అంజలి ఘటిస్తూ 12 ఆసనాలతో సమ్మిళితమైన సూర్య నమస్కారాలు శ్రేష్టమైనవని ఋషులు , యోగా గురువులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సిద్దిపేట వ్యాస మహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన కార్యక్రమాన్ని రూపొందించింది. ఇందులోనే రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీలను నిర్వహిస్తుంది. సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల మినీ స్టేడియంలో ఆదివారం ఉదయం 6 గంటలకు వినూత్న కార్యక్రమాలను అమలు చేయడానికి నెల రోజుల నుంచి విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. యోగా గురువులు తోట సతీష్, సంధ్య ఆధ్వర్యంలో యోగా శిక్షకులు కవిత, మంజుల, వాసవీ, సంధ్య , సింధూరి, పూజిత, మనీషా, అర్చన , రాములు తదితరులు ప్రత్యేక యోగా శిబిరాలు నిర్వహించి విభిన్న వర్గాలకు సూర్య నమస్కారాల సాధనలో శిక్షణ అందిస్తున్నారు. ఈ అద్భుత ప్రదర్శనను వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. లక్ష్యాన్ని దాటిన అనంతరం రికార్డ్స్‌లో ఈ ప్రదర్శన నమోదు చేయనున్నారు.

1400 మందికి పైగా యోగా సాధకుల రాక

రాష్ట్రంలోని సుమారు 20 జిల్లాల నుంచి యోగా సాధకులు ఈ విశేష కార్యక్రమంలో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీల్లో పాల్గొనడంతోపాటు, శత సహస్ర నమస్కారాల ప్రదర్శనలో భాగం కానున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారి కోసం సిద్దిపేటలోని వివిధ ప్రాంతాల్లో వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో భాగస్వామి అవుతారు. పాల్గొన్న వారందరికీ మెడల్స్, సర్టిఫికెట్లను ప్రధానం చేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తి



సిద్దిపేటలో నిర్వహించనున్న శత సహస్ర సూర్య నమస్కారాలతోపాటు రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారాల పోటీలో భారీ సంఖ్యలో యోగా సాధకులు పాల్గొనే అవకాశం ఉంది. ఈ దిశగా అన్ని రకాల మౌలిక సౌకర్యాలు, ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. ఇలాంటి కార్యక్రమాలకు సిద్దిపేట నెలవు అవుతుండడం సంతోషంగా ఉంది.

– తోట సతీష్, ప్రముఖ యోగా గురువు

అనాథలైన ఆడ పిల్లలు

- గతంలో తండ్రి, గురువారం తల్లి మృతి
- గ్రామస్తుల సాయంతో దహన సంస్కారాలు



అక్కాచెల్లెల్లు భాగ్య, భార్గవి

వట్‌పల్లి(అందోల్): ఆ చిన్నారులకు చిన్న వయస్సులోనే పెద్ద కష్టం వచ్చి పడింది. తల్లిదండ్రుల సంరక్షణలో అల్లారుముద్దుగా పెరగాల్సిన వయస్సులో వారు ఒంటరయ్యారు. చిన్నతనంలో తండ్రి వదిలేసి వెళ్లగా, తాజాగా తల్లి మృతితో ఇద్దరు ఆడపిల్లలు అనాథలైన ఘటన వట్‌పల్లి మండలంలోని కేరూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బురగల్ల బూదెమ్మ(35), సామెల్ దంపతులకు భాగ్య(11), భార్గవి(9) ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొన్నేళ్లపాటు సంగారెడ్డిలో నివాసం ఉన్నారు. భర్త సామెల్ భార్యాపిల్లలను వదిలేసి వెళ్లగా కొద్ది రోజులకు చనిపోయాడు. పెద్ద దిక్కును కోల్పోయిన బూదెమ్మ పిల్లలతో గ్రామానికి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంది. ఇంతలో బూదెమ్మ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. నిరుపేద కుటుంబం కావడంతో డబ్బులు లేక గ్రామస్తుల సహకారంతో చిన్న కూతురు భార్గవి అంత్యక్రియలు పూర్తి చేసింది. తల్లి మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు రోదించడం అక్కడున్న వారిని కంటతడిపెట్టించింది. నా అనే వారు లేక ఆ పసిపిల్లల దీనగాథ ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తోంది. ఇల్లు లేని పరిస్థితిలో పూరి గుడిసెలో నివాసం ఉంటున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకొని ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా ఇల్లు మంజూరు చేయడంతోపాటు ఉన్నత చదువులు చదవడానికి సహాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంతలో ఎద్దుల జాతర

- ఉర్సే షరీఫ్ ఫిర్‌గైబ్ సాహెబ్ దర్గా ఉత్సవాల్లో భాగంగా నిర్వహణ
- వేల సంఖ్యల్లో పశువులతో రైతులు, వ్యాపారులు
- రూ.కోట్లల్లో క్రయ విక్రయాలు



న్యాల్‌కల్ సమీపంలో జరిగే సంతకొచ్చిన పశువులు(ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామ శివారులో ఉర్సే షరీఫ్ ఫిర్‌గైబ్ సాహెబ్ దర్గా ఉత్సవాలు ప్రతీయేటా ఫిబ్రవరి మాసంలో వారం రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. అందులో భాగంగా ఒక రోజు (ఆదివారం) పశువుల సంత జరుగుతుంది. ఈ సంత 365 ఏళ్ల నుంచి కొనసాగుతుంది. సంతకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు సమీపాన గల కర్నాటక, మహారాష్ట్రాల నుంచి రైతులు, వ్యాపారులు పశువులను పెద్ద ఎత్తున తీసుకొస్తారు. 95 శాతం మేర ఎద్దులు, కోడ దూడలు రాగా కేవలం 5 శాతం మాత్రమే ఇతర పశువులు వస్తాయి.

ఒక్కో ఎడ్ల జత రూ.3 లక్షల వరకు

ఈ సంతకు పలు జాతులకు చెందిన పశువులు వస్తాయి. దేవుణి, రెడ్ కందారీ, దంగి బ్రీడ్, పోడతూర్పు, క్రిష్ణవెల్లి, ఒంగోలు, తదితర పశువులను తీసుకొస్తారు. వేల సంఖ్యల్లో రావడంతో సంత కిక్కిరిసిపోతుంది. క్రయ, విక్రయాలు పెద్ద ఎత్తున జరుగుతాయి. ఒక్కో ఎడ్ల జత రూ.3 లక్షల వరకు పలుకుతుంది. పశువులను కొనేందుకు రైతులతోపాటు వ్యాపారులు కూడా ఇక్కడకు తరలి వస్తారు.

బహుమతుల ప్రధానం

నానాటికి తరిగిపోతున్న పశు సంపదను పెంచేందుకు ప్రముఖ కళాకారుడు హోతి బస్వరాజ్ సొంత డబ్బును ఖర్చు చేసి మేలు రకం పశువులకు బహుమతులు ప్రధానం చేయడం సంతలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. 18 ఏళ్లు నుంచి ప్రతీయేటా బస్వరాజ్ సంతలో ప్రజా ప్రతినిధులు, నాయకులతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మేలు రకం పశువులు కలిగిన రైతులకు బహుమతులు ప్రధానం చేస్తూ వస్తున్నాడు.

పశువుల సంతను పెంచేందుకే..



రోజు రోజుకూ పశువుల సంఖ్య తగ్గిపోతుంది. వ్యవసాయం కూడా దెబ్బతింటుంది. పశు సంపదను పెంచేందుకు రైతులకు సంతలో అవగాహన కల్పించడంతో పాటు మంచి పశువులు కలిగిన రైతులకు ప్రతీయేటా బహుమతులు అందిస్తున్నా.

– బస్వరాజ్, ప్రముఖ కళాకారుడు, న్యాల్‌కల్

నీటి తొట్లు ఏర్పాటు



ఉర్సులో భాగంగా ఒక రోజు జరిగే పశువుల సంతకు వచ్చే రైతులు, వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం. ముఖ్యంగా పశువులకు తాగు నీటిని అందించేందుకు నాలుగు ప్రాంతాల్లో నీటి తొట్టీలను ఏర్పాటు చేశారు.

– మక్బూల్ అలీ ఖదీమ్ ముత్వల్లి, న్యాల్‌కల్

ప్రారంభమైన ఉర్సు ఉత్సవాలు

న్యాల్‌కల్ గ్రామ శివారులో గల ఉర్సే షరీఫ్ గైబ్ ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు దర్గాలో ప్రజలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సాయంత్రం న్యాల్‌కల్ గ్రామం నుంచి సర్కారి గంధం దర్గా వరకు తీసుకెళ్లారు. వివిధ గ్రామాలతో పాటు సమీపాన గల కర్నాటక రాష్ట్రం నుంచి కూడా ప్రజలు తరలి వచ్చి దర్గాను దర్శించుకున్నారు.



దర్గా వద్ద నాయకులు, ప్రజలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు



లారీని వెనుక నుంచి ఢీకొని నుజ్జునుజ్జయిన కారు

గజ్వేల్‌రూరల్: ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన రాజీవ్ రహదారిపై గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారులో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. ఎన్‌టీపీసీ రామగుండంకు చెందిన సొంత అన్నాదమ్ముళ్లు మెరుగు లింగం(52), మెరుగు మహేశ్(43) అక్క కొడుకు(మేనల్లుడు) బినేశ్(29), డ్రైవర్ ప్రణయ్ సాగర్‌తో కలిసి కారులో పని నిమిత్తం హైదరాబాద్‌కు శుక్రవారం తెల్లవారు జామున బయలుదేరారు. మార్గమధ్యలో గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారులో రింగురోడ్డు దాటిన తర్వాత రాజీవ్ రహదారిపై నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బినేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ లింగం మృతి చెందాడు. మహేశ్ పరిస్థితి విషమంగా ఉంది. డ్రైవర్ ప్రణయ్‌సాగర్‌ను చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు బైక్‌లను ఢీకొట్టిన కారు

కౌడిపల్లి(నర్సాపూర్): రెండు బైక్‌లను గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మండలంలోని వెంకట్రావుపేటగేట్ సమీపంలో 765డి జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ విఠల్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ వైపు నుంచి మెదక్ వైపు వస్తున్న కారు వెంకట్రావ్‌పేట గేట్ సమీపంలో రెండు బైక్‌లను ఢీకొట్టింది. దీంతో కన్నారం తండాకు చెందిన లక్ష్మీకి స్వల్పగాయాలు కాగా నర్సాపూర్ మండలం మూసాపేటకు చెందిన యాదగిరికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులను 108లో నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యాదగిరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.